కథా నిలయం
3742
శ్రీకాకుళం

# ఏరు దాటిన కెరటం

బాబు గుక్కపెట్టి ఏడుస్తుంటే కృష్ణమూర్తికి మెలుకువ వచ్చింది. మెలుకువ వచ్చాక చూస్తే బాబు నేలమీదకు దొర్లిపోయి, వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. కృష్ణమూర్తి బద్ధకం వదిలించుకుని అన్నాడు—"ఏయ్. వీణ్ణోకసారి చూడు." ఆమాట అనేసి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడేగాని, కృష్ణమూర్తి చెవుల్లో బాబు ఏడుపు గింగురు మంటూనేఉంది. అతనూ ఓ క్షణంపాటు చూశాడు. ఆ క్షణంలోనూ అతని పిలుపుకు జవాబుగా మనిషిరాలేదు సరికదా జవాబురాలేదు.

బాబు క్షణక్షణానికి శ్రుతిపెంచుకుంటూ పోతున్నాడు. ఏడాదివెధవ లేడు ఎలా ఉంటాడు ఏడింటి వరకూ పాలులేకుండా. కళ్ళు నులుపుకుంటూ, బద్ధకం వదిలించుకుని మంచం దిగాడు కృష్ణమూర్తి. "ఏం చేస్తున్నావ్ శారదా?"

అయినా శారద దగ్గర్నుంచి జవాబురాలేదు.

కృష్ణమూర్తి బాబును ఎత్తుకున్నాడు. ఒక్కక్షణం ఏడుపుమాని, వెంటనే అందుకున్నాడు. శారద దగ్గర్నుంచి జవాబు రాకపోయేసరికి శారద బాత్‌రూంలో వుందేమోనని అటుకేసి వెళ్ళాడు. తలుపు దగ్గరగా వేసి ఉంది. తలుపు దగ్గరనుంచే పిలిచాడు. "శారదా!"

కృష్ణమూర్తి ఈసారి తలుపు తట్టాడు. తలుపు తెరుచుకుంది. లోపల శారద లేదు.

చిరాగ్గా ఇంట్లోకి వచ్చాడు కృష్ణమూర్తి. బాబు ఏడుపుతో మనసంతా అశాంతిగా వుంది. అల్లకల్లోలంగా వుంది. అయినా శారద ఎక్కడకు వెళ్ళింది?

బాబుకు ఆకలి ఎక్కువైనట్లుగా వుంది. ఏడుపు యింకా ఎక్కువ చేశాడు. కృష్ణమూర్తి వంట యింట్లోకి నడిచాడు. అక్కడెక్కడా అతనికి పాలు కనబడలేదు. విసుగ్గా వెనక్కు తిరిగాడు. వీధిగది గుమ్మంముందు పాలు పోసిన గిన్నె ఉంది. స్టౌ అంటించి పాలు దానిమీద పడేశాడు. బాబును ఆడిస్తూ దొడ్లోకి తెచ్చాడు.

దొడ్లో జామచెట్టుమీద రెండు చిలకలు ముచ్చట లాడుకొంటు న్నాయి. ఒక చిలుక తన కాలికిందనున్న జామపండులోంచి కొంచెం గుజ్జు తీసి రెండో దానికి అందిస్తోంది. బాబుకూ, కృష్ణమూర్తికీ ఆశ్చర్యం ఆనందాన్ని కలుగజేసింది.

బాబు ఏడుపు ఆపుచేశాడు. ఆనందంగా ఆ చిలుకకేసి చూస్తు న్నాడు. బుగ్గలమీద కన్నీటి చారలు, కన్నీరూ వున్నాయి. కంట్లోవున్న నీటి బొట్లు మెరుస్తున్నాయి. కృష్ణమూర్తికి బాధ కలిగింది.

శారద ఏం చేసినా ఊరుకుంటా డతను. కాని బాబును ఏడిపిం చటం మాత్రం సహించలేని విషయం. ఇంట్లో పిల్లలు కళకళ లాడుతూ నవ్వుతూవుంటే బాగుంటుంది కాని, ఏడుస్తూ ఈదురో మంటూ వుంటే ఇంటికన్నా నరకం ఇంకోటి వుండదనిపిస్తుంది. అందుకే తనకూ, శార దకూ ఎప్పుడైనా గొడవంటూ వస్తే అది బాబు విషయంలోనే. పిల్లలంటే తనకు ఇష్టం. వాళ్ళను మించిన ఆనందం ఇంకేదీ లేదు. వాళ్లు ఇంటికి దీపాలు. కంటికి పాపలు.

అయినా శారద ఎక్కడకు వెళ్లింది? తెలీదు. రాగానే చెప్పాలి— ఇక మీదట యిలా బాబును ఏడిపిస్తే ఊరుకునేది లేదని. ఈసారి బజారు

లోకి వెడితే చలం పుస్తకం "పిల్లల పెంపకం" కొని తేవాలి. ఇంట్లో చలం పుస్తకాలు అన్నీ వున్నాయి. ఆ ఒక్క "పిల్లల పెంపకం" తప్ప. చలం రాసిన చెత్త పుస్తకం ఆ పిల్లల పెంపకం ఒకటే అనుకున్నాడు తను. కానీ ఎంతటి మేధావి చలం? పిల్లల్ని కని పారేయటం తప్ప కనుపాపల్లా చూచుకొనే తల్లు లెంతమంది వున్నారో ఈ లోకంలో?

బాబు మళ్ళీ ఏడవటంతో కృష్ణమూర్తి ఆలోచనలు ఆగిపోయాయి. అమూల్ డబ్బా ఒకటి బాబుకు అందిచ్చాడు. ఆ డబ్బాతో బాబు ఆడు కొంటుంటే స్టౌమీద పాలు దింపి గ్లాసులోకి పోశాడు.

అయినా శారద ఎక్కడకు వెళ్ళింది?

వెనక ఏదో గాజులు చప్పుడైతే శారదే అనుకొని వెనక్కు తిరు గుతూ అన్నాడు కృష్ణమూర్తి - "ఎక్కడకు వెళ్ళావు శారదా ?"

వచ్చింది పనిమనిషి రంగి.

"అంట్లు దొడ్లోనే వున్నాయి. చూడవ్వా" అంటూ పాలు కలపడం లోనే మునిగిపోయాడు కృష్ణమూర్తి.

బాబు కొంచెం పాలు తాగి, కొంచెం పారబోసి, మొత్తానికి పాలు తాగాను అన్నట్లుగా ముఖం పెట్టాడు. కృష్ణమూర్తికి ఎంతో ఆనందంగా ఉంది, బాబు అమూల్ డబ్బా మూత తీయ ప్రయత్నిస్తోంటే.

క్రిందపడ్డ అమూల్ డబ్బామీద బాబు బొమ్మ అటూ యిటూ కదు లుతోంది. ఆ కదలికలో ఎంతో అందాలు గుమ్మరిస్తోంది.

శారద.... శారద.... ఏదీ? ఇంకా రాదేం? అనుకొన్నాడు కృష్ణ మూర్తి.

కృష్ణమూర్తి అలా అనుకొన్నాగానీ శారద జాడలేదు.

*　　　*　　　*

"పోలీస్ రిపోర్టు ఇద్దామంటావురా కృష్ణా?"

# 4

తలెత్తి చూశాడు కృష్ణమూర్తి రావ్‌కేసి. రావ్ ముఖం సీరియస్‌గా వుంది. ఆ ముఖంలో బాధ వుంది. కృష్ణమూర్తితో అన్నాడు రావేమళ్ళీ? “నువ్వు అపార్థం చేసుకోకు - నీ బాధ నాకు తెలీంది కాదు. నిన్న పొద్దుటినుంచీ మీ ఆవిడ కనబడటంలేదు. బెజవాడకు యిచ్చిన టెలిగ్రాంకు రిప్లయి వచ్చేసింది. ఇక్కడా లేక, పుట్టింటిలోను లేక ఇంకెక్కడ వుందంటావ్?”

కృష్ణమూర్తి ఏమీ అనలేదు.

క్షణం ఆగి అన్నాడు రావ్ “ఏమయిందో నాకూ తెలీదు. అందుకే పోలీస్ రిపోర్టు యిద్దామనుకుంటున్నాను.”

“వద్దురా, పోలీసుల దృష్టికి పోవటం నాకిష్టం లేదు.”

“పోలీసుల దృష్టిలోకి పోవటం యిష్టం లేకపోతే పోనీ, నీ భార్య మీదేనా నీకు యిష్టం ఉందా లేదా? అదీ లేకపోయినా సరే, పోనీ, అదిగో వాడిసంగతి ఆలోచించు—ఆ బాబుగాడికోసమైనా....”

“వద్దురా, నాకది యిష్టంలేదు. ఇక ఆ సంగతి ఎత్తకు,” అన్నాడు కృష్ణమూర్తి.... “అయినా శారద ఏమయిందంటావురా?”

రావ్‌కు ఆ క్షణంలో ఎన్నో ఊహలు కలిగాయి—దొంగతనాలు, దోపిడీలు, మానభంగాలు, ఎత్తుకుపోవడాలు, లేచిపోవడాలు, పారిపోవడాలు, ఆత్మహత్యలు, హత్యలు.... అయినా అవన్నీ రావ్ బయటకు అనలేదు.

తలుపు తట్టిన చప్పుడయింది. రావే వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా పనిమనిషి రంగి. రావ్ తలలో మెరుపొకటి మెరిసింది.

రంగి ఇంట్లో పనంతా పూర్తిచేశాక బయటకు కదిలింది. క్షణం తర్వాత రావ్ కృష్ణమూర్తితో చెప్పి బయటకు కదిలాడు. రంగి నడుస్తోంటే కూడా నడిచాడు రావు. రంగి కొంతదూరం నడిచాక ఒక పూరింటిలో

దూరింది. తనూ ఆ పూరింటిలోకి నడిచాడు రావ్. రావును చూసి రంగి కంగారు పడింది.

నెమ్మదిగా అడిగాడు రావు, "నువ్వు శారదమ్మగారింట్లో పని చేస్తున్నావు కదూ?"

"ఔనండీ!" అంది రంగి.

"అయితే శారదమ్మగా రెక్కడకు వెళ్లారు?"

"నాకేం తెలీదు. ఆ పెద్దోళ్ళ ఇంట్లో ఏదో జరిగితే మీరు నన్నడిగితే నేనెట్లా జవాబు చెప్పేది?" అంది రంగి.

రావుకు రంగి మాటల్లో ఏదో భావం కనబడింది. రంగికి కొంచెం అయినా తెలిసి వుండి తీరాలనుకొన్నాడు. మళ్ళీ అడిగాడు, "నీ యిష్టం మరి ఆ అమ్మగారు కనబడ్డం లేదని పోలీసు రిపోర్టు యివ్వదలచుకొన్నాం. పోలీసువాళ్ళు నిన్ను అడుగుతారు. అనుమానం వస్తే తీసుకెళ్ళి జైలులో కూడా పెడతారు. ఆ తర్వాత నీ యిష్టం!"

రంగి అంది వెంటనే "నన్నెందుకు పెడతారు జైల్లో?"

"ఎందుకూ? ఆ అమ్మగారు కనబడ్డంలేదు. ఎక్కడికైనా వెళ్ళి పోయిందో, ఎవరైనా ఏమైనా చేశారో ఎలా తెలుస్తుంది మరి?"

రంగి తత్తర పడుతూ అంది "ఆయమ్మ వెళ్ళిపోయుంటుంది!"

"నీ కెలా తెలుసు?"

"నే నట్లే అనుకుంటున్నా!"

"అంటే, ఎక్కడి కెళ్ళిపోయి వుంటుంది?"

సందేహంతో అంది రంగి—"ఆ ఇంజనీరు బాబుతోనే వెళ్ళి పోయుండొచ్చు!"

రావ్ ముఖం నల్లబడిపోయింది. నెమ్మదిగా అడిగాడు. "నీకెందుకు అలా అనిపిస్తోంది?"

"ఆయన అపుడపుడు వస్తొండేవాడు—"

రావు మరేమీ మాట్లాడలేదు. కథ చాలా తేలికగా విడిపోయిందని పించింది. కాని ఈ సంగతి కృష్ణమూర్తికెలా చెప్పాలి?

ఇల్లు చేరుకొన్నాడు రావు - ఇల్లు చేరుకోబోయే ముందే ఆ ఇంజినీరు ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంజినీరు యిల్లు ఖాళీ చేసేసి వెళ్ళిపోయాడట నాగార్జునసాగర్‌కు! అతడు యిల్లు ఖాళీచేసిన టైము, శారద కనిపించక పోవడం మొదలుపెట్టిన టైము ఒక్కటే!

ఇక సందేహంలేదు - శారద ఆ ఇంజనీరుతోనే....

అయినా ఈ ఆడవాళ్లు యిలా ఎలా చేయగలరు? తాళికట్టి జీవితం పంచుకుంటున్న వ్యక్తిని యెలా మోసం చేయగలరు? ముఖ్యంగా కృష్ణమూర్తి లాంటిగంగిగోవును మోసం చేయటం.... యెలా చేయగలిగింది? భర్తకు తెలియనీకుండా ఇన్నాళ్ళ నుంచీ ఎలా సాగిందీ తెరవెనుక నాటకం?-

అయినా ఈ విషయం కృష్ణమూర్తితో చెప్పటమెలా?

ఇంటికి వచ్చిన రావును కృష్ణమూర్తి అడిగాడు— "ఎక్కడకు వెళ్లావు!"

రావేమీ అనలేదు. రావు గుండెల్లో కక్ష, అసహ్యం అన్నీ నిండుకొని ఉన్నాయి. మంచంమీద బాబు నిద్రపోతున్నాడు. ఎంత అందంగా ఉన్నాడు! ఇంత అందాల రాశిని ఎలా వదలి వెళ్ళ గలిగింది శారద?

దాంపత్య బంధం ఇంతకాలము తనకు ఎంతో బలమైనదిగా కనిపించేది. ఈ క్షణంలో పేలవంగా తేలికగా కనబడింది రావుకు.

"కృష్ణా పోనీ ఒక పని చెయ్యరా? బాబును బెజవాడలో దింపి రారా!"

కృష్ణమూర్తి ఆశ్చర్యంగా చూశాడు రావుకేసి! "అదేమిటలా అంటున్నావు?"

"అవునురా నీ మిసెస్ ఎక్కడకు వెళ్ళిందో తెలీదు, యెప్పుడు వస్తుందో తెలీదు. అంతకాలమూ వీడిని వాళ్ళ తాతగారింట్లో వుంచేస్తేనే మంచిది?"

కృష్ణమూర్తి పేలవంగా నవ్వాడు. "భలేవాడివిరా, అయినా ఎంత కాలం అక్కడ వుంటాడు? శారద వచ్చేస్తుందిరా, నాకు తెలుసు.... వచ్చాక బాబు లేకపోతే బెంగపెట్టుకొంటుంది!"

పిచ్చివాడు ఈ బంధాల నన్నింటినీ తేలికగా తెంచుకొని పోయిన శారద, కృష్ణమూర్తి దృష్టిలో ఎంత ఉన్నతంగా వుంది! ఈ సంగతి యెలా చెప్పటం??

మనసు దృఢపరచుకొంటూ అన్నాడు రావు. "కృష్ణా!-నన్ను అపార్థం చేసుకోకు. ఇంతసేపటి నుంచీ యిది చెప్పకూడదనే ప్రయత్ని స్తున్నాను. కానీ చెప్పక తప్పటంలేదు- శారద రాదు యిక నీదగ్గరకు!"

కృష్ణమూర్తి ఆశ్చర్యంగా చూశాడు!

రావే అన్నాడు మళ్ళీ—"ఔనురా నీ మిసెస్, అదే, యిక నీ దగ్గ రకు రాదు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. ఎందుకంటే శారద వెళ్ళి పోయింది- వెళ్ళిపోవటం కాదు. లేచిపోయింది మరొకరితో!...."

కృష్ణమూర్తికి తల తిరిగిపోయింది. ముఖం చిట్లించుకొంటూ అన్నాడు "రావ్! నువ్వంటున్న దేమిటో నీకు అర్థం అవుతోందా?"—

"ఆ- ఎటొచ్చీ నీకే అర్థం కావడంలేదు. శారద, అదిగో, ఆ యింట్లో వుండే ఇంజినీరుతో వెళ్ళిపోయింది. ఇపుడు నాగార్జునసాగర్ దగ్గర కులాసాగా వుండివుంటుంది, చాలా?? నువ్వొత్త పిచ్చివాడివి! ఈ ఊళ్ళో అందరికి ఈ సంగతి తెలిసింది. కానీ నీకే సంగతి తెలీదు!"

కృష్ణమూర్తి ఏమీ అనలేదు. అతను యింకా ఆ షాక్ నుంచి తేలుకోలేదు. శారద....తన జీవనజ్యోతి....ఇంతటి పని యెలా చేయ గలిగింది? ఎలా వదిలి వెళ్ళిపోగలిగింది తన్ను? ఎక్కడుంది లోపం? అయినా యిదంతా నిజమా కాదా? తెలుసుకోవాలి. తప్పదు. అదే అన్నాడు రావుతో!

రావు నవ్వాడు– "నాగార్జునసాగర్ కా?"

తల ఊపాడు కృష్ణమూర్తి.

రావేమీ అనలేదు. కృష్ణమూర్తి మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆ లావా బయట కొచ్చితీరాలి. అది ఇక్కడ జరగలేదు. బహుశా నాగార్జునసాగర్ లో జరుగుతుందేమో....

రావు, కృష్ణమూర్తి యిద్దరూ బాబుతోసహా నాగార్జునసాగర్ చేరు కొనేసరికి, చీకటి తెరలు విచ్చుకోవడం ప్రారంభం అయింది. తూర్పు నుంచి వెలుగు రేఖలు నెమ్మది నెమ్మదిగా పరుచుకొంటున్నాయి.

బస్సు దిగిన వెంటనే యిద్దరూ ప్రాజెక్టు హౌస్ లో రూం తీసు కొని, స్నానం అదీ ముగించారు. ఆ తర్వాత ఇద్దరూ కాలనీలో నడక సాగించారు. ఆ ఇంజనీరు పేరు చెప్పే సరికి, ఎవరో ఒకతను ఆ ఇంటి గుర్తులు చెప్పారు, అటుకేసి కదిలారు యిద్దరూ..........

"అదిగో, ఆ ఇల్లు అయివుండాలి నువ్వొక్కడివే వెళ్ళిరా! బాబును నేను ఉంచుకొంటాను!" అన్నాడు రావ్. రావ్ చూపించిన యింటి ముందెవరో స్త్రీ ముగ్గులేస్తున్నది.

కృష్ణమూర్తి నవ్వాడు "బాబును తీసుకెళ్ళాలిరా!"

రావేమీ అనలేదు.

ఆ ఇంటిముందు ముగ్గులేస్తున్నవ్యక్తిని చూశాక. ఆ యిల్లు ఎవరి దని అడిగే అవసరం లేకపోయింది కృష్ణమూర్తికి. ఆ వ్యక్తి శారద!!

నెమ్మదిగా అక్కడ ఆగాడు కృష్ణమూర్తి.

ఎవరో రావటంలా అనిపించి దిగ్గున తలెత్తింది శారద. తనభర్త కృష్ణమూర్తి! హఠాత్తుగా నిలబడిపోయింది. కళ్ళల్లో భయం మనసులో వణుకు.

"ఏమండీ, ఇంజనీరు గారున్నారా?"

శారద అదిరిపడింది. నెమ్మదిగా తలెత్తింది మరోసారి, ఆ తర్వాత తల వూపింది ఉన్నారన్నట్లుగా!

"ఒక్కసారి పిలుస్తారా? కొంచెం పనుంది!"

శారద యింట్లోకి వెళ్ళింది. కృష్ణమూర్తి ముగ్గుకేసి చూశాడు. తన జీవితంలా ఆ ముగ్గూ అసంపూర్తిగానే వుండిపోయింది.

అయినా ముగ్గు వేస్తోందంటే కోరుకొని వచ్చినట్లే మరి!

ఇంట్లోంచి ఇంజనీరు బయట కొచ్చాడు. ముఖం పేలవంగా ఉంది. అయినా జీవంలేని నవ్వొకటి పెదవులమీదకు తెచ్చుకొని అన్నాడు "రండి!"

"నేను...." కృష్ణమూర్తిని ఆపుతూ అన్నాడు ఇంజనీరు. "శారద చెప్పింది!"

"క్షమించండి అవసరం అయి రావాల్సి వచ్చింది. మీరేమీ అనుకోనంటే రెండు నిమిషాలు శారదతో మాట్లాడతాను!" అన్నాడు కృష్ణమూర్తి యింట్లో కూర్చున్న వెంటనే.

"దానికేం భాగ్యం...." అంటూ ఇంజనీరు లోపలికి వెళ్ళాడు.

శారద వచ్చింది.

"కూర్చోండి!"

శారద కూర్చోగానే కొంగు నోట్లోకి తీసుకొంది. అయినా ఏడుపు ఆగటంలేదు.

"శారదగారూ....!"

శారద భోరుమంది ఒక్కసారి.

"చూడండి, ఈ క్షణంవరకూ మీరంటే నాకు ఎనలేని గౌరవం వుంది. నా కన్నా వున్నతుడని మీరు యితనితో వచ్చారు. అందుకని మీరెందుకు ఇతనితో వచ్చారని అడగను!"

"ఏమండీ.... శారద బొంగురు గొంతుతో అంది.

"శారదగారూ– అనవసరంగా ఏడవకండి. ఏడుపు అంటే నా కసహ్యం మీరు ఏడిస్తే నిద్రపోతున్న బాబు లేస్తాడు. అప్పుడు కథ మరోలా అయిపోతుంది. అది నాకు యిష్టంలేదు!...."

"ఏమండీ, నేను వచ్చేస్తానండీ....!"

"మిమ్మల్ని రమ్మని అడగటానికి రాలేదు నేను, నాకంటే బెటర్ మాన్‌ను ఎన్నుకొన్నారు మీరు! మీ మార్గానికి అడ్డురానునేను, కాని చూడండి, ఈ బాబు అమ్మలేకుండా ఉండగలిగే వయసుకాదు. అందుకే అడగటానికే వచ్చాను. చెప్పండి, బాబును ఏం చెయ్యమంటారు? అనాథాశ్రమంలో చేర్పమంటారా? లేకపోతే మీరే వుంచేసు కుంటారా?"

శారద వెక్కి వెక్కి ఏడుస్తోంది...."ఏమండీ. నన్ను క్షమించండి. నేను వచ్చేస్తాను!"

కృష్ణమూర్తి వీల్లేదన్నట్లుగా తల వూపుతూ అన్నాడు "బాబు సంగతి చెప్పండి...."

"నన్ను క్షమించండి. తప్పుచేశాను."

క్షణం ఆగి అన్నాడు కృష్ణమూర్తి "చూడండి శారదగారూ! తప్పు చేశారా లేదా అని అడగటంలేదు నేను. కెరటాలన్నీ ఏట్లోనే వుంటేనే బాగుంటాయి. అందాన్నీ ఆనందాన్నీ కలుగజేస్తాయి. కానీ ఆ కెరటం ఏరు దాటితే అందమూ, ఆనందమూ ఉండదు. పైపెచ్చు వర

దలా ప్రమాదాన్ని తెస్తాయి, దుఃఖాన్ని తెస్తాయి. ముంచేస్తాయి. మన కుటుంబంలో వచ్చిన ఈ వరద బాబును ముంచేస్తోంది. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను. బాబును ఏం చేయమంటారని....?" కృష్ణ మూర్తి ఆపేశాడు.

శారద చాలా సేపు తర్వాత అంది "బాబును ఉంచేయండి!"

కృష్ణమూర్తి పేలవంగా నవ్వి అన్నాడు. "నాకు తెలుసు మీరిది అంటారని! కానీ బాబు మీ సంసారానికి అడ్డు లేకుండా వుండాలంటే.... ఒక్కసారి వారినికూడా అడగండి."

శారద యింట్లోకి వెళ్ళింది! ఈసారి ఇద్దరూ తిరిగి వచ్చారు.

నెమ్మదిగా అన్నాడు ఇంజనీరు "బాబును ఇక్కడే వుంచేయండి నాకేమీ అభ్యంతరం లేదు. నా కన్నకొడుకులాగే చూసుకుంటాను!"

కృష్ణమూర్తి లేచాడు. సోఫామీద బాబు హాయిగా నిద్రపోతున్నాడు. నెమ్మదిగా అన్నాడు: "నిజమేలెండి! బాబు యిన్నాళ్లూ నా కన్న కొడుకే అనుకొన్నాను. కానీ ఈనాడు తెలిసింది-బాబు మీ కన్నకొడుకని శలవ్" అంటూ విసురుగా ఇంట్లోంచి బయట కొచ్చాడు కృష్ణమూర్తి.

ప్రొజెక్ట్ హౌస్ రూంలో కృష్ణమూర్తి కంట్లోంచి వస్తున్న ఆ కన్నీటి కెరటాలని ఆపమని వ్యర్థప్రయత్నాలు చేస్తున్నాడు రావ్. *

[ఆంధ్రజ్యోతి ఆనంద దీపావళి కథల పోటీలలో బహుమతి పొందిన కథ. ఆంధ్రజ్యోతి 15-11-74.]